క్లుప్తంగా

ముగిసిన వేసవి శిక్షణ



విద్యార్థులతో గౌతమ ఘాట్ వాకర్స్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు, కోచ్ నాగిరెడ్డి

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం గౌతమ ఘాట్‌లో జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరం జరిగింది. శిక్షకుడు మాస్టర్ కర్రి నాగిరెడ్డి ఆధ్వర్యంలో కరాటే శిక్షణ విజయవంతంగా ముగిసింది. శిక్షణ పొందిన 60 మంది విద్యార్థినీ విద్యార్థులకు గౌతమ ఘాట్ వాకర్స్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కీర్తి బాబ్జి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ప్రస్తుత రోజుల్లో ఆడపిల్లలు కచ్చితంగా కరాటే వంటి ఆత్మరక్షణ విద్య నేర్చుకోవాలని అన్నారు. వైస్ ప్రెసిడెంట్ కొంటిపు వెంకన్నబాబు, సెక్రటరీ గునిశెట్టి విజయ కిరణ్, ట్రెజరర్ వై.నాగేశ్వరరావు, చైర్మన్ భద్రరావు తదితరులు పాల్గొన్నారు.

18న బాస్కెట్‌బాల్ జట్టు ఎంపికలు

ప్రకాశంనగర్: ఆంధ్రప్రదేశ్ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గుంటూరులో అంతర్ జిల్లాల బాస్కెట్ బాల్ పోటీల్లో పాల్గొనే అండర్-18 జిల్లా బాలుర జట్టు ఎంపికలు 18న సాయంత్రం 4 గంటల నుంచి జరుగుతాయి. ఆ రోజు స్థానిక ఆర్ట్స్ కళాశాల క్రీడా మైదానంలో ఈ ఎంపికలు ఉంటాయని జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కె.శివప్రసాద్, ఎన్‌వీవీ శ్రీనివాసరావు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2005 జనవరి 1 తర్వాత పుట్టిన విద్యార్థులు ఈ ఎంపికలకు అర్హులన్నారు. విద్యార్థులు సంబంధిత పత్రాలతో హాజరు కావాలని ఆయన సూచించారు.

కరాటే పోటీల్లో ప్రతిభ

ప్రకాశంనగర్: ఇండోనేపాల్ కరాటే ఇంటర్నేషనల్ సంస్థ ఆధ్వర్యంలో వైజాగ్ స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో అండర్-10, 19 విభాగాల్లో పలువురు విద్యార్థినీ విద్యార్థులు ప్రతిభ చాటారని కరాటే మాస్టర్ పిల్లి అరుణ్‌కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్.శ్రీలక్ష్మీలత, పి.శ్రీవిద్య, స్వాతిలక్ష్మి, బి.కీర్తన, సీహెచ్ కార్తిక్, కె.లక్ష్మీభవాని, జి.నిశ్చల్, ఎం.నవదీప్, పి.శ్రీరామ్, వి.పల్లవి బంగారు పతకాలు సాధించారన్నారు. ఎస్.మనోహర్ సాయి, దుర్గ, జాక్సన్, వెంకట కావ్యశ్రీ, సీహెచ్ మోక్షిత వెండి పతకాలు దక్కించుకున్నారని అన్నారు. ఆర్.జైన్ కార్లోన్, సీహెచ్ జైదీప్, ఆర్.అఖిల, ఎల్.వైష్ణవి, పి.పూజ కాంస్య పతకాలను సాధించారని, విజేతలను డీఈవో అబ్రహం అభినందించారని చెప్పారు.

పనుల్లో పురోభివృద్ధి సాధించాం

- ఫ్లైఓవర్ నిర్మాణంలో ప్రగతి భేష్
- ఎంపీ మార్గాని భరత్‌రామ్



మోరంపూడిలో ఫ్లైఓవర్ పనులను పరిశీలిస్తున్న ఎంపీ మార్గాని భరత్‌రామ్

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం ప్రధాన జంక్షన్ మోరంపూడి వద్ద నిర్మిస్తున్న ఫ్లైఓవర్ బ్రిడ్జి పనుల్లో పురోభివృద్ధి సాధించామని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. మంగళవారం పార్టీ శ్రేణులతో కలసి ఈ ఫ్లైఓవర్ వంతెన పనులను ఆయన నిశితంగా పరిశీలించారు. ఒక్కో విభాగం పనులను గురించి కూలంకుషంగా కాంట్రాక్టర్ సురేష్ గౌడ్‌ను ఎంపీ ప్రశ్నించారు. వారం రోజుల్లో జరిగిన పనుల పురోభివృద్ధిని ఎంపీ స్వయంగా పరిశీలించారు. పిల్లర్ల నిర్మాణంలో పురోభివృద్ధి స్పష్టంగా కనిపిస్తుందని ఎంపీకి కాంట్రాక్టర్ తెలిపారు. అయితే డ్రైనేజీ పనుల్లో జాప్యంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. రోడ్డు కటింగ్ అనుమతి కావాలని, అందుకు ట్రాఫిక్ పోలీస్ అధికారులను కోరినట్లు కాంట్రాక్టర్ సురేష్ వివరించారు. ట్రాఫిక్ పోలీస్ ఉన్నతాధికారులకు ఎంపీ ఫోన్ చేసి పర్మిషన్ ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం ట్రాఫిక్ డీఎస్పీ సంఘటనా స్థలానికి వచ్చి ఎంపీ భరత్‌తో మాట్లాడారు. డ్రైనేజీ నిర్మాణానికి సహకరించాలని ఆయన్ని ఎంపీ భరత్ కోరారు. కాగా రాత్రి సమయాల్లో ఈ జంక్షన్ వద్ద విద్యుత్ లైట్లు లేకపోవడంతో వాహనదారులకు ఇబ్బందిగా ఉంటోందని, అక్కడ పెద్ద లైట్లు ఏర్పాటు చేయాలని కాంట్రాక్టర్‌కు ఎంపీ సూచించారు. ఈ సంవత్సరం చివరి నాటికి బ్రిడ్జి పనులు పూర్తవ్వాలన్నదే తన ఆకాంక్ష అని తెలిపారు. ఎఫ్‌ఓబీ పనుల పరిశీలన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. వారం రోజుల్లో చూస్తే పనుల్లో పురోభివృద్ధి స్పష్టంగా కనిపిస్తోందన్నారు. డిసెంబర్ నెలాఖరు నాటికల్లా పనులు పూర్తయితే వచ్చే కొత్త సంవత్సరం నాటికి ఈ వంతెన ప్రజలకు అందుబాటులోకి వస్తుందని చెప్పారు. ఆయన వెంట పార్టీ నాయకులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు చెక్

రాజమహేంద్రవరం సిటీ: నగరంలో తాగునీటి సరఫరాకు ఇబ్బంది రాకుండా చర్యలు చేపడుతున్నట్లు ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. స్థానిక కోటిలింగాల పేట డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద సుమారు రూ.3 కోట్లతో చేపడుతున్న ఎలెవేటెడ్ లెవెల్ సర్వీసు రిజర్వాయర్ (ఈఎల్ఎస్ఆర్)కు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.3.06 కోట్లతో నిర్మించే ఈ రిజర్వాయర్‌తో 34, 40, 41 డివిజన్‌లకు చెందిన సుమారు 20 వేల మందికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సంకిస భవానీప్రియ, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, నగర పాలక సంస్థ ఎస్ఈ పాండురంగారావు, ఈఈ కనకారావు, ఏఈ భవానీ, పాలిక శ్రీను, డాక్టర్ అనుసూరి పద్మలత, మజ్జి అప్పారావు, నక్కా శ్రీనగేష్ తదితరులు పాల్గొన్నారు.



కోటిలింగాలపేటలో అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ భరత్‌రామ్

జగనన్న కానుకలు ఓ వరం



ధవళేశ్వరంలో జగనన్న విద్యాకానుక కిట్లు అందజేస్తున్న కన్వీనర్లు



నగరంలో జేవీకే కిట్లు పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ నగర ఆర్గనేటర్ అడపా శ్రీహరి

కంబాలచెరువు: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అందిస్తున్న జగనన్న విద్యా కానుకలు ఓ వరం లాంటివని వైఎస్సార్ సీపీ సిటీ ఆర్గనేటర్ అడపా శ్రీహరి అన్నారు. స్థానిక జాంపేట లూథరన్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలు తెరిచే నాటికే విద్యార్థులందరికీ పుస్తకాలు, బ్యాగ్, బెల్ట్, యూనిఫామ్ అందజేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. విద్యార్థులంతా చక్కగా చదువుకుని భావిభారత పౌరులుగా ఎదగాలన్నారు. పాఠశాల కరస్పాండెంట్ విజయ, ప్రధానోపాధ్యాయిని బీహెచ్ జెమీమా, నగర వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కాటం రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ధవళేశ్వరం: ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ధవళేశ్వరం సచివాలయం-2 కన్వీనర్లు తలారి వరప్రసాద్, పేర్ల దుర్గాప్రసాద్ (బాసి) అన్నారు. స్థానిక కొత్తపేటలోని మండల పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లను అందజేశారు. విద్యా కమిటీ చైర్మన్ రామలక్ష్మి, స్కూల్ హెచ్‌ఎం వరలక్ష్మీదేవి, సీఆర్పీ జ్యోతి, వైఎస్సార్ సీపీ నాయకుడు మైలపల్లి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రజా శ్రేయస్సే లక్ష్యంగా పాలన

- వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్ నాగేశ్వర్
- కాతేరులో గడప గడపకూ..



కాతేరులో సమస్యలను పరిశీలిస్తున్న చందన నాగేశ్వర్

రాజమహేంద్రవరం రూరల్: ప్రజా శ్రేయస్సే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో పాలన సాగిస్తున్నారని వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్, ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ అన్నారు. మంగళవారం కాతేరు గ్రామ సచివాలయం-1 పరిధిలో ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వలంటీర్లు, గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో కలసి చందన నాగేశ్వర్ ఇంటింటికీ వెళ్లారు. నాలుగేళ్ల కాలంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ద్వారా అందిన లబ్ధిని వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. అలాగే స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుని త్వరితగతిన పరిష్కరిస్తానని చందన హామీ ఇచ్చారు. అనంతరం నాగేశ్వర్ మాట్లాడుతూ సీఎం జగన్ తీసుకొచ్చిన సచివాలయ, వలంటీర్ వ్యవస్థలతో ప్రజలకు సేవలు చేరువయ్యాయన్నారు. వైఎస్సార్ సీపీ నేతలు యెజ్జు వాసు, ఆచంట కల్యాణ్, పెనుమాక సునీల్, దేవ మాత, కప్పల సూర్యకుమారి, రాజేశ్వరి, గ్రామ కార్యదర్శి హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ అంబాసిడర్లకు అభినందన



మహిళలను అభినందిస్తున్న కమిషనర్ దినేష్‌కుమార్

రాజమహేంద్రవరం సిటీ: నగర సుందరీకరణలో భాగంగా పారిశుధ్య కార్మికులకు తడి, పొడి వ్యర్థాలను వేర్వేరుగా అందజేస్తున్న మహిళలను స్వచ్ఛ అంబాసిడర్స్ ఆఫ్ ది స్ట్రీట్ కార్యక్రమానికి ఎంపిక చేస్తున్నట్లు కమిషనర్ దినేష్‌కుమార్ తెలిపారు. మంగళవారం మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మన సుందర నగరం పేరుతో 32, 33, 35 డివిజన్లలో స్వచ్ఛ అంబాసిడర్స్ ఆఫ్ ది స్ట్రీట్ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరపాలక సంస్థ నిబంధనలను పాటిస్తున్న వారి ఫొటోలను ఇతరులకు ఆదర్శంగా నిలవాలనే ఉద్దేశంతో వాల్ ఆఫ్ ఫేమ్ కార్యక్రమం ప్రారంభించామన్నారు. అర్హులైన పౌరులకు గ్రీన్ కార్డ్‌లు, గులాబీ పువ్వులు, క్లాత్ బ్యాగులు తదితరాలను పంపిణీ చేసి ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో లావణ్య తదితరులు పాల్గొన్నారు.

గోదావరిలోకి దూకి విద్యార్థి గల్లంతు?



రవిశంకర్ (ఫైల్)

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలో ఫెయిల్ కావడంతో మనస్తాపం చెందిన తాడితోట నారాయణ కళాశాల విద్యార్థి తాళ్లపూడి కె.రవిశంకర్ శ్రీనివాస్ (18) మంగళవారం గోదావరి నదిలోకి దూకాడు. పోలీసుల కథనం ప్రకారం.. తాళ్లపూడికి చెందిన రవిశంకర్ శ్రీనివాస్ నారాయణ కళాశాలలో చదువుతున్నాడు. మార్చిలో జరిగిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షల్లో ఫెయిల్ కావడంతో సప్లిమెంటరీ కట్టాడు. ఆ పరీక్ష ఫలితాల్లోనూ ఫెయిల్ అయ్యాడు. దీనిపై తల్లిదండ్రులు మందలించారనే కారణంతో గోదావరి బ్రిడ్జిపై నుంచి దూకేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. బ్రిడ్జిపై ఆ విద్యార్థి వేసుకొచ్చిన మోటారు సైకిల్‌ను పోలీసులు కనుగొన్నారు. అతని కోసం గాలిస్తున్నారు.

మరమ్మతులకు చర్యలు

ప్రకాశంనగర్: స్థానిక ఉమామార్కండేయ స్వామివారి దేవస్థానంలో పలు మరమ్మతులకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. మంగళవారం దేవాలయాన్ని ఆ శాఖ ఉన్నతాధికారులు సందర్శించారు. గోపురం మరమ్మతులు, పెయింటింగ్స్ వంటి పనులకు వెంటనే ఎస్టిమేట్లు తయారు చేయాలని సంబంధిత అధికారులను వారు ఆదేశించారు.

గోదావరి కలుషితం కాకుండా చూడాలి

రాజమహేంద్రవరం సిటీ: పేపర్‌మిల్లు వ్యర్థాలతో గోదావరి కలుషితం కాకుండా చర్యలు చేపట్టడంతో పాటు వేలాది కుటుంబాలకు జీవనాధారంగా ఉన్న పేపర్‌మిల్లు మూతపడకుండా చూడాలని గోదావరి పరిరక్షణ సమితి చైర్మన్ టీకే విశ్వేశ్వరరెడ్డి విజ్ఞప్తి చేశారు. మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నమామి గోదావరి స్కీంలో కేంద్రం రూ. 54 కోట్లు మంజూరు చేయగా, దీనికి మ్యాచింగ్ గ్రాంట్ రాష్ట్ర ప్రభుత్వం రూ.34 కోట్లు ఇవ్వాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కోరగా స్పందించి ఆ మేరకు నిధులు విడుదల చేశారని తెలిపారు. దీనివల్ల గోదావరిలో కలిసే హాస్పిటల్, మలమూత్రాల వ్యర్థాలు శుద్ధి చేయడానికి హుకుంపేటలో 50 ఎంఎల్‌డీ ప్లాంట్ వస్తుందని ఆయన వివరించారు. పేపర్‌మిల్లు వ్యర్థాలు వెంకటనగరం వద్ద కాకుండా పైప్‌లైన్ ద్వారా ధవళేశ్వరం దాటాక గోదావరిలో శుద్ధి చేసి కలిపేలా చూడాల్సి ఉందని విశ్వేశ్వరరెడ్డి చెప్పారు. గోదావరి పరిరక్షణ సమితి సభ్యులు చంద్రు వీరభద్రరావు, ఎస్.అప్పారావు, ఎస్‌వీవీ రెడ్డి, సుబ్బరాజు, సివిల్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



వైద్య శిబిరంలో రోగులతో మాట్లాడుతున్న డాక్టర్ సత్యప్రసాద్

కంబాలచెరువు: స్థానిక సత్య కిడ్నీ అండ్ మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ రెండో వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక తిలక్‌రోడ్డులోని ఆసుపత్రి ప్రాంగణంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా యూరాలజీ వైద్యనిపుణుడు డాక్టర్ ఎ.సత్యప్రసాద్, హాస్పటల్ ఫిజీషియన్ డాక్టర్ జీఆర్ చైతన్య వైద్య సేవలు అందించారు. యూరాలజీ, జనరల్ మెడిసిన్‌కు సంబంధించి అవుట్ పేషెంట్ విభాగానికి వచ్చిన రోగులకు ఉచితంగా సేవలు అందించారు. అలాగే సీరమ్ క్రియేటినిన్, బ్లడ్ యూరియా, బ్లడ్ గ్లూకోజ్, హెచ్‌బీ వంటి పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. ప్రొస్టేట్ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షను కూడా ఉచితంగా చేశారు. డాక్టర్ సత్యప్రసాద్ మాట్లాడుతూ హాస్పటల్ ఏర్పాటు చేసి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా వైద్య సేవలను ఉచితంగా అందించాలనే లక్ష్యంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు.





మురుగునీటి సమస్య రానీయొద్దు



మోరంపూడిలో పారిశుధ్యాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ దినేష్‌కుమార్

రాజమహేంద్రవరం సిటీ: మోరంపూడిలో నిర్మించిన అంతర్గత కాలువలను నేషనల్ హైవేలో నిర్మించిన ప్రధాన కాలువలోకి అనుసంధానించి, మురుగు సమస్య రాకుండా చర్యలు చేపట్టాలని కమిషనర్ దినేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. పారిశుధ్య పరిశీలనలో భాగంగా మంగళవారం స్థానిక మోరంపూడిలోని పలు ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. సిబ్బందికి, అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. కాలువల్లో చెత్తను ఎప్పటికప్పుడు తొలగించి నీటి పారుదలకు ఎటువంటి అడ్డంకులు లేకుండా చూడాలన్నారు. మోరంపూడిలో నిర్మించిన అంతర్గత కాలువలను ప్రధాన కాలువకు అనుసంధానం చేయాలన్నారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్, ప్రజారోగ్య శాఖ అధికారులు పాల్గొన్నారు.

17 నుంచి జూడో జట్టు ఎంపికలు

ప్రకాశంనగర్: ఏపీ జూడో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 17 నుంచి 19 వరకూ తిరుపతిలోని శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఏపీ ఓపెన్ క్యాడెట్ ఇంటర్ డిస్ట్రిక్ జూడో చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికలు జరుగుతాయి. మంగళవారం ఈ విషయాన్ని అసోసియేషన్ సభ్యులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2006, 2007, 2008 సంవత్సరాలలో జన్మించిన వారు ఈ పోటీలకు అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రాలతో 17వ తేదీ ఉదయం 9 గంటలకు హాజరు కావాలని చెప్పారు. మరిన్ని వివరాలకు 99898 76643 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

కొత్త కార్యవర్గం ఎన్నిక



జూడో అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు వీరే..

ప్రకాశంనగర్: జిల్లా జూడో అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక మంగళవారం స్థానిక అసోసియేషన్ కార్యాలయంలో జరిగింది. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా శీలం వెంకట్రావు, ఉపాధ్యక్షుడిగా ఎంవీవీ సత్యనారాయణ, కార్యదర్శిగా సాయిరాం, కోశాధికారిగా రామ్మూర్తి రాజు ఎన్నికయ్యారు. వీరితో పాటు మరో ఐదుగురు కార్యవర్గ సభ్యులను ఎంపిక చేశారు.

ప్రీ స్కూల్ విద్యపై అవగాహన



ప్రీ స్కూల్ విద్యపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ప్రకాశంనగర్: స్థానిక లింగంపేట-2 అంగన్‌వాడీ కేంద్రంలో సమగ్ర శిశు సంక్షేమ అధికారి సీహెచ్ నరసమ్మ ఆధ్వర్యంలో ఐసీడీఎస్ జన భాగీదారి కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రీ స్కూల్ విద్యపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే నాణ్యమైన భోజనంతో పాటు ఉన్నతమైన విలువలతో విద్య ఎలా అందిస్తున్నారో వివరించారు. ప్రభుత్వ పాఠశాల ప్రాముఖ్యతను తెలిపారు. అంగన్‌వాడీ టీచర్ మున్నీ, సహాయకురాలు ఎం.పుష్పకుమారి, జీఎల్ సునీత తదితరులు పాల్గొన్నారు.

నూతన విద్యా విధానంపై అవగాహన

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం ఓఎన్జీసీ కేంద్రీయ విద్యాలయంలో మంగళవారం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన జాతీయ విద్యా విధానంపై అవగాహన పెంచేందుకు జన భాగీదారి పేరిట సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథి ఓఎన్జీసీ నామినీ చైర్మన్ నవేద్ మాట్లాడుతూ నేటి విద్యార్థులను రేపటి తరానికి అనుగుణంగా సిద్ధం చేయాలన్నారు. దీనికి నూతన విద్యా విధానం దోహదపడుతుందన్నారు. విద్యాలయ ప్రిన్సిపాల్ కృష్ణకుమార్ సిన్హా మాట్లాడుతూ విద్యార్థులను తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు కూడా శ్రద్ధ చూపాలన్నారు. ప్రాథమిక శిక్షకులు హారిక, నమ్రతా, కుమారి మోహన సంఖ్యా శాస్త్ర నైపుణ్యాన్ని, అక్షరజ్ఞానానికి ఉపకరించే ప్రక్రియలను, బోధనకు ఉపయోగపడే వివిధ ఉపకరణాలను ప్రదర్శించారు.

పారదర్శకంగా బీజేపీ ప్రభుత్వ పాలన

కేంద్ర విదేశీ వ్యవహారాల సహాయ మంత్రి మురళీధరన్



లబ్ధిదారులతో మాట్లాడుతున్న కేంద్ర విదేశీ వ్యవహారాల సహాయ మంత్రి మురళీధరన్

రాజమహేంద్రవరం రూరల్: కేంద్రంలోని తొమ్మిదేళ్ల బీజేపీ ప్రభుత్వ పాలన అంతా పారదర్శకంగా సాగిందని కేంద్ర విదేశీ వ్యవహారాల సహాయ మంత్రి వి.మురళీధరన్ అన్నారు. మంగళవారం కోలమూరులో బీజేపీ తొమ్మిదేళ్ల సేవ, సుపరిపాలన కార్యక్రమం రూరల్ పార్టీ అసెంబ్లీ కన్వీనర్ ఆకుల శ్రీధర్ అధ్యక్షతన జిల్లా ఐటీ సెల్ కన్వీనర్ పడాల హతీరం ఆధ్వర్యంలో జరిగింది. కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధిదారులను మంత్రి కలుసుకున్నారు. అనంతరం ఉపాధి పనులు సక్రమంగా అమలవుతున్నాయా.. వేతనాలు సకాలంలో అందుతున్నా అని తెలుసుకున్నారు. కోవిడ్ సమయంలో పనిలేక ఇబ్బంది పడుతున్న పేదలకు పూర్తి స్థాయిలో ఆహార భద్రత గరీబ్ కళ్యాణ్ అన్న యోజన ద్వారా కల్పించారన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి, అసెంబ్లీ కోకన్వీనర్ యనాపు ఏసు, పడాల అంజనేయులు, మండల అధ్యక్షుడు ఎన్‌వీబీఎన్ ఆచారి, కురగంటి సతీష్, పన్నాల లక్ష్మీసంతోషి పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం సిటీ: ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రధాని మోదీ ప్రత్యేక దృష్టి సారించారని కేంద్ర మంత్రి మురళీధరన్ అన్నారు. స్థానిక రైల్వే స్టేషన్‌లో 4, 5 ప్లాట్‌ఫామ్ పనులను ఆయన పరిశీలించారు. ఈ ప్లాట్‌ఫామ్‌లు పూర్తయితే మెరుగైన ప్రయాణ సౌకర్యం ఏర్పడుతుందన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొమ్మల దత్తు తదితరులు పాల్గొన్నారు.



